# నా కథ

ప్లాట్‌ఫారంమీద జనం కిటకిటలాడుతూ ఉన్నారు. నేను ఇంకా ముప్పై, నలభై, గజాలదూరాన ఉన్నప్పుడే రైలు కూసింది. గడగబా పరుగెత్తికెళ్ళి అందుకొని, ఇంటర్ క్లాసు బండిలో కూర్చున్నాను. రైలు కదులుతూ ఉండంగా ఇంకో పెద్దమనిషి వచ్చి ఎక్కాడు.

ఆయన స్ఫురద్రూపి. ఖద్దరు కట్టుకొన్నాడు. కళ్ళకు లావైన జోడు ఉంది. ఆయన్ను చూస్తే, మనకు కలిగే భావాలు ఏమిటంటే, మొదటిది, ఆయన చాలా పెద్దమనిషి అనీ, రెండోది ఆయన బాగా చదువుకొన్నవాడు అనీ.

వచ్చి కూర్చుని ఆయన ముందు నాలుగువైపులా చూశాడు తనకు కావలసిన వస్తువ ఏదో కనిపించనట్టు, విసుక్కున్నట్లు ముఖం చిట్లించాడు. కాసేపు నావైపు తేరి పారజూచి, ఏదో అసంతృప్తి కలిగినట్లు ముక్కాడు. అసలు ఆయనకు రైలంటేనే ఇష్టంలేనట్లు కనిపించింది.

ఇల్లాగే కాసేపు అవస్థపడి, ఎల్లాగో మనస్సు తృప్తి పరచుకొన్నాడు కాబోలు, పైఉత్తరీయంతో శుభ్రంగా ఉన్న బల్లను దులిపి కూర్చున్నాడు.

కూర్చుని కిటికీ నుంచి బైటికి చూశాడు, లోపల ఏమీ చూడాల్సింది లేనట్లుగా. జేబులోనుంచి సిజరుపాకెట్టూ

నిప్పెట్టె తీసి తనకు దగ్గరగా పెట్టుకొని మళ్ళీ కిటికీలోనుంచి చూస్తూ కూర్చున్నాడు.

రైలు పక్క స్టేషనులో ఆగింది. ఈయన కిటికీలో నుంచి ప్లాట్‌ఫారంమీద ఉన్న మనుష్యులవంక కాసేపు చూశాడు. రైలు కదిలింది. ఈయన లేచి నుంచుని, ఉత్తరీయంతో మళ్ళీ బల్లను ఓమారుదులిపి, కూర్చున్నాడు. కాసేపు మళ్ళీ కిటికీలోనుంచి, పరుగెత్తుతున్న చెట్లనూ, టెలిగ్రాఫు స్తంభాలనూ చూశాడు. ఎంతసేపని చూస్తాడు? విసుగెత్తింది కాబోలు, తన దగ్గరున్న పుస్తకం ఒకటితీసుకొని, అటుతిప్పి, ఇటుతిప్పి, చివరకు ఒకచోటునుంచి ప్రారంభించి చదువుకోటం మొదలుపెట్టాడు.

ఆయన చదువుతున్నాడన్న మాటేగాని ఆనందంతో చదువుతున్నట్లు మాత్రం కనిపించలేదు. కాస్త చదవటం, విసుక్కోటం. ముఖం చిట్లించటం మళ్ళీ చదవటం ఇదీవరస. మధ్య మధ్యను ఒకసారి నవ్వుకొనేవాడేకాని అదేదో వికారపునవ్వు. వెక్కిరింత నవ్వునూ.

ఆ అవస్థచూస్తే, ఆయనకు ఏమీ తోచక బాధపడుతున్నాడనీ, ఏదో చదువుకొంటూ అయినా ప్రొద్దు పుచ్చుదామంటే, ఆయనకు ఆ పుస్తకం ఏమాత్రం తృప్తినీ, ఆనందాన్ని ఇయ్యటం లేదని నాకు తోచింది.

చివరకు ఆయన నావంక చూశాడు మాట్లాడిద్దామని, కాని మాట్లాడించలేదు. అపరిచయుడితో మాట్లాడటం

మర్యాదకాదని అనుకొనే వాళ్ళలో ఆయన ఒకడైయుం టాడు. ఆయన అవస్థ చూచి నేనే ఆయనను మాట్లాడించ డానికి సాహసించి "తమరు చదువుతున్న పుస్తకం ఏమి టండీ" అని అడిగాను.

ఆయన చప్పరించి కళ్ళు చిట్లించి చాలా నిరుత్సాహం చూపిస్తూ 'ఏదో పిచ్చి పుస్తకం లెండి. రైలుపుస్తకాల్లో ఒకటి' అన్నాడు. నేనూ చిరునవ్వు నవ్వి అల్లాంటి పుస్తకాల విషయమై నాకూ అసహ్యమే అన్నట్లు తలఊపాను.

తరువాత ఆయన పుస్తకంలో ఇంకా రెండు పంక్తులు చదివి, తలఎత్తి నావంక చూస్తూ "ఏమిటండి! ఇల్లా వ్రాస్తా రూ? ఇదంతా వాఙ్మయమనే గామోలు వీళ్ళు అనుకోటం" అన్నాడు.

ఆయన ఏమిచదువుతున్నారో, దేన్నిగురించి ఆయన అంత అసంతృప్తిని కనపరుస్తున్నాడో నేను తెలుసుకోకుం డానే ఇల్లా అన్నాను. "అల్లాగేనండి ప్రతివాడూ ఇవుడు రచయిత అయినాడు. భాషా పాండిత్యం కావాలా ఏమన్నా నా!" అంటూ ఆధునిక వాఙ్మయాన్నిగురించి, నాఅసంతృప్తిని అంతా వెలిబుచ్చాను.

ఈ మాట వినేసరికి ఆయనముఖం చేటంత అయింది. పుస్తకం తపీమని మూసివేసి, బల్లమీదపెట్టి, మోకాలి మీద అరచేత్తో కొట్టుకుంటూ "అదండీ. అది సంగతి" అని

సరిగ్గా తాను, అనుకొన్న విషయాన్ని నేను గ్రహించినందుకు కాబోలు నన్నొక మహా తెలివైన వాడికింద జమకట్టి, ప్రసన్నవదనంతో ముందుకు జరిగి కూర్చున్నాడు.

నేనూ ఉత్సాహంతో మళ్ళీ ఇల్లాగ అన్నాను. "ఈ మధ్య పదేళ్ళనుంచీ పుస్తకరచన మరీ ఎక్కువైందండి. వాడుక భాషలో రచనలు ఉండాలని ఎప్పుడైతే పుట్టిందో, అప్పటినుంచీ, ఈ రకపు వ్రాతలు మహా ఎక్కువైనాయండీ?

మాంచి బంగారపు తీగలాగ సాగిన నామాటలధోరణికి, నేనేసంతోషిస్తూ, ఆయనముఖంవంక ఆశగాచూశాను, ఎంతగా ఆనందిస్తాడో చూద్దామని.

ఆయన నాతో పూర్తిగా ఏకీభవించినట్లు చూస్తూ "అయితే ఒకటండి. వాడుక భాషలో వ్రాయకూడదని నేను అనను. భాషా స్వరూపాన్ని నిర్ణయం చేయటానికి నాకు తాహతు లేదు. కానీ..." అని ఆ వాక్యం పూర్తిచేయకుండా ఊరుకొన్నాడు. నేనన్నాను, "అయితే, ఏమిటి మీ అసంతృప్తికి కారణం?" "భాష ఎల్లాగు ఉన్నా ఫరవాలేదండి. పుస్తకం ఆనందంకోసం చదువుకొంటాము. ఆ ఆనందం ఇయ్యనపుడు ఆపుస్తకం ఎందుకుచెప్పండీ? తగలెయ్యనా?' అన్నాడు. ఆయన చెప్పింది సబబుగానే ఉందని నేను తల ఊపాను.

పైగా ఇలా అన్నాను—"నిజమేనండీ! అవినీతికథలు కూడా వ్రాస్తున్నారు కొంతమంది!" ఆయన ఈ మాటలు

విని ఏమీ సంతోషించక "నీతి, అవినీతి—ఏదో ఉండాలె. పది నీతులన్నా ఉండాలె. పది బూతులన్నా ఉండాలె. ఏవీ లేని వెధవ పుస్తకాలు చూశారూ, చొప్పదంటు నమిలి నట్లు ఉంటాయి. అల్లాంటి పుస్తకాలు ఎందుకు చెప్పండి!" అంటూ ఆయన విసుక్కున్నాడు.

నేను నవ్వి తల వూపుతూ అన్నాను. "నిజమేనండీ. మరి ఎందుకో అల్లాగ వ్రాస్తారు. అచ్చువేసే వాళ్ళకైనా శాస్త్ర తెలియవద్దండీ?"

"వాళ్ళదేమి ఉందండీ, ఏదో ఇంత పోగుచేసి అచ్చు వేయకపోతే గడవదు." ఇల్లాగ అంటూ ఆయన మళ్ళీ పుస్తకం వంక చూశాడు ఒక్కనిమిషం. ఇద్దరం మాట్లాడ కుండా ఊరుకొన్నాము. నేను ఆయన ముఖంవంకే చూస్తూ కూర్చున్నాను. ఆయన చదివే పుస్తకం ఏమై ఉంటుందా అని ఆలోచిస్తూ, చూస్తూ ఉండగానే ఆయన పెదవులు విడి వడి ఒక చిరునవ్వు తళుక్కు మన్నది.

ఆయన తలఎత్తి నావంక చూశాడు ఎందుకో. నేను చిరునవ్వునవ్వుతూ ఆయనచూపును ఆహ్వానించాను. ఆయన 'చూడండి' అని నన్ను పిలిచి "ఈ పుస్తకంలో చూశారూ, ఒక కథ లెండి. ఈయన ప్రొద్దున్నే లేచి కాలకృత్యాలు తీర్చు కొన్నాట్టండి!"

'అబ్బా, ఎంతపని చేశాడండి!' అని నేను అన్నాను వెక్కిరింతగా.

'ఉండండి. ఇంకా వినాల్సిన విషయం చాలా ఉంది. ఆయన భార్య అంతకుపూర్వమే లేచిందట!''

''చాలా తమాషా అయిన విషయమే వ్రాస్తున్నాడు.' అన్నాను నేను. ఆయన విరగబడి నవ్వాడు. నేనూ నవ్వాను'

''ఇల్లాగ నడుస్తుందండీ కథ. చివరసంగతి ఏమిటంటే భార్య కాఫీ ఇస్తుంది. ఈయన తాగుతాడు—ఇదండీ కథ చూశారా.'' అని ఆయన విరగబడి నవ్వాడు. ఏదో పిచ్చి వ్రాతలు' అంటూ నేనూ నవ్వాను.

ఆ తరవాత మరో రెండు నిమిషాలు ఆయన ఇంకో కథ కాబోలు మొదలుపెట్టి చదివాడు. మళ్ళీ ఏమి తమాషాలు చెబుతాడో అని నేను ఆయనవంకే చూస్తున్నాను. మళ్ళీ నవ్వుతూ ''ఆయన భార్య ఆయనకు ఎదురుగా నుంచున్నదట'' అని పుస్తకంలోని విషయాన్ని నాకుచెప్పి నివ్వెరపోయి నావంకచూశాడు అంతి ఛండాలపు పని ఇంకోటి లేనట్లు.

నేనేమీ మాట్లాడకపోవటం మూలాన ఆయన మళ్ళీ ఇల్లాగ అన్నాడు. ''భార్య ఇల్లాగ నిలబడి, ఇవ్వాళ ఇంట్లో మెంతులూ, ఆముదం లేవని చెప్పిందటచూశారా–''అన్నాడు.

నేను నవ్వి ఊరుకొన్నాను.

ఆయన ఊరుకోక...''ఏమిటండీ ఇది! ఇదేనా కథా రచన! మెంతులుతో ఆముదంతో కథ అల్లుతారండి?'' అని

విసుక్కుంటూ, వికారంగా నవ్వుతూ నా ముఖంవంక చూశాడు నా ఆమోదంకోసం.

ఏమిటో, మనకు అర్థంకావండీ, ఈ వ్రాతలూ! అన్నాను నేను, ఏదో అనకపోతే బాగుండదని!

"ఏమిటో! ఎందుకండీ? ఈ ఆముదం వ్రాయుమని ఎవ డేడ్చాడండి. జాతికి ఉత్తేజం కలిగించి, రక్తాన్ని ఉడికించేవి ఉన్నాయి చూశారూ, అవీ కథలంటే!"

"నిజం, నిజం, అండీ," అన్నాను నేను ఆదుర్దాగా ఎక్కడ నన్ను తెలివి తక్కువవాడు అనుకొంటాడో అయ నతో ఏకీభవించక పోతేనని! ఆయనా సంతోషించాడు.

ఆయనకు అంత విసుగూ, అసహ్యమూ కలిగించిన ఆ పుస్తకం ఏమిటా అని నాకు కుతూహలం కలిగి..."ఏమి టండీ ఆ పుస్తకం?" అని అడిగాను.

ఆయన చప్పరించి "ఏదో వెధవ పుస్తకం పోనిద్దురూ" అంటూ పెట్టెసద్దుకొంటున్నాడు. మరి ఎందుకు కొన్నారూ?" అన్నాను నేను ఆశ్చర్యపోతూ.

"మా బావమరిది ఒకడు ఉన్నాడు లెండి. వాడికి శాస్త్ర కవిత్వపు పైత్యంకూడాఉంది. వాడు చెప్పాడు ఈపు స్తకం ఏదో బాగుంటుందని. పోనీగదా రైలులో కూర్చుని చదువుకో వచ్చునని కొన్నాను" అని విచారంగా పుస్తకం వంక చూశాడు.

అంత పనికిమాలిన పుస్తకం వ్రాసింది ఎవరై ఉంటారూ అని నాకూ సందేహం కలిగి "ఏవరండీ గ్రంథకర్త?" అన్నాను.

ఆయన ముఖం చిట్లించుకొని, చప్పరించి ఎవరో అన్నాడు...

నా మనస్సులోని సందేహం తీరక నేను ఆయనవంక ఏదో ఇదిగా చూశాను; నేనేదో సందేహిస్తున్నా ననుకొని, ఆయన "నామాటలు బద్ధం అయితే, ఒకకథ చదవండి మీకే తెలుస్తుంది" అంటూ ఆ పుస్తకం నా చేతిలో పెట్టాడు.

చూద్దును గదా అది నేను వ్రాసిన పుస్తకమే. నేను వ్రాసిన పుస్తకాల్లో అదే ఉత్తమమైనది అని నేను అనుకొనే వాడిని. ఇందాకటినుంచీ అన్నమాటలు నాపుస్తకాన్ని గురించే అని తెలిసికొనే సరికి నేను ఎటువంటి అవస్థలో పడ్డానో నే చెప్పలేను. తెల్లపోయి ఊరుకొన్నాను.

నే నేదో అనుమానిస్తున్నానని అనుకొని, ఆయన "చదవండి చదవండి—" అని మళ్ళీ వికారంగా నవ్వాడు.

"ఎందుకు లెండి. అక్కరలేదు. చెప్పారుగా! నిజమే. ఇప్పటి కాలంలో కుక్కగొడుగుల్లాగ, పుస్తకాలు చాలా తయారవుతున్నాయి," అని పుస్తకం మళ్ళీ ఆయనకు అందించాను.

ఆయన నవ్వుతూ పుస్తకం పుచ్చుకొని బల్లమీద విసిరి పారేశాడు, అసహ్యంతో. నా కడుపులో తుపాకిపెట్టి కాల్చినట్లు అయింది. నా బాధ ఆయనకు ఏం తెలుస్తుంది!

అన్నీ సర్దుకొని ఆయన పెట్టెలో పెట్టుకొంటానికి కాబోలు పుస్తకాన్ని చేత్తోఎత్తి పట్టుకొని, నాకు చూపుతూ, "రూపాయండీ, ఈ పుస్తకం ఒక్క రూపాయిపెట్టి కొన్నానండీ!" అన్నాడు. పాపం ఆయన బాధ నేను గ్రహించలేకపోలేదు. ఆయన మళ్ళీ ఓసారి నావంక తిరిగి, "రూపాయి దండుగండీ" అని తన విచారాన్ని స్పష్టంగా తెలియపర్చాడు.

"నా కిస్తారూ ఆ పుస్తకం, రూపాయీ ఇస్తానూ" అన్నాను నేను. ఆయన నావంక విచిత్రంగా చూస్తూ, తెలిసికూడా బోల్తాపడుతున్నాడేమూ అని ఆశ్చర్యపోతూ...... "ఓ తీసుకోండి కావాలంటే" అన్నాడు ఆయన.

రూపాయీ ఇచ్చి ఆ పుస్తకం తీసేసుకొన్నాను. ఇంతలో స్టేషను రావటంచేత, ఆయన దిగిపోతూ ఈ ప్రపంచంలో ఇంత తెలివి తక్కువ వాళ్ళుకూడా ఉన్నారా అని ఆశ్చర్యపోయినట్లు చూచి, ఓ చిరునవ్వు నవ్వి వెళ్ళిపోయినాడు.